APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి సంపుటి 19 సంచిక 32 గురువారం 15 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల- 5 రూ

## విగ్రహాల దొంగతనం..

### దేవుడు ఏం చేస్తున్నాడు



8లో

## మాజీ మావోయిస్టుల పెట్టుబడులతో పేకాట స్థావరాలు




3లో

## టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు.



2లో

- టీటీడీకి రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా
- రూ.130 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ
- బ్యాంకు లావాదేవీల ద్వారా చెల్లింపులు చేసి, హవాలా మార్గంలో నగదు వెనక్కి

## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

### క్యాబినెట్ కమిటీ ఆమోదం

78 రోజుల బోనస్ ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది

దసరా పండగకు ముందు ఉద్యోగులకు బోనస్ ఇచ్చినట్లే ఈసారి కూడా పండుగకు ముందే బోనస్

2025-26 సంవత్సరంలో రైల్వేల పనితీరు బాగుందని యూనియన్ క్యాబినెట్



2లో

# రూ.43.20 కోట్లతో

## ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణం

- పోచారంలో 480 ఫ్లాట్ల నిర్మాణానికి శంకుస్థాపన
-పాల్గొన్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి
-కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



ఘట్‌కేసర్ **నీలగిరి వార్త**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్‌లో రూ.43.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 10/ాలో తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 480 ఫ్లాట్లను నిర్మించనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు.

# పాలమూరు బాధితులకు

## రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

### హరీష్‌రావు డిమాండ్



గద్వాల / పాలమూరు:**నీలగిరి వార్త**

కర్ణాటకలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలమూరు దళిత బాధితులకు తక్షణమే ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారాన్ని అందించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించడంతో తాము ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్యం అందించడంతోపాటు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు, ప్రమాద తీవ్రతను బట్టి బాధితులందరికీ తగిన పరిహారం అందించాలని కోరారు. కొందరు బాధితులకు సరైన వైద్యం అందక, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం విచారకరమని విమర్శించారు. ఒకప్పుడు పాలమూరు జిల్లా వ్యవసాయానికి, విత్తనోత్పత్తికి ప్రసిద్ధి చెందిందని హరీష్‌రావు గుర్తుచేశారు. వివిధ రకాల విత్తన పంటల సాగుతో పాటు విత్తన కంపెనీల ద్వారా స్థానికులకు ఉపాధి లభించేదని చెప్పారు.

## బీసీ, ఈబీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం

### మరో అవకాశం




వివరాలు 2లో

# సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోంది: కేటీఆర్



ఉమ్మడి కరీంనగర్, **నీలగిరి వార్త** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'సింగరేణి కార్మిక గర్జన' సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ఉన్నారు. సింగరేణిపై తుపాకి పెట్టి.. రైతులకు నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సాగును నాశనం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిపై నిందలు వేస్తోందన్నారు. కరెంట్ కష్టాలకు బొగ్గు లేకపోవడమే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సింగరేణి బొగ్గు ఇవ్వడం లేదని బద్నాం చేస్తోందని ఆయన ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రభుత్వం సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ఆయన వెల్లడించారు. అందుకే సింగరేణిని ప్రైవేటు పరం చేయడానికే ప్రభుత్వం ఇలాంటి కుట్రలు పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు.

'పోరాటాల పురిటిగడ్డ రామగుండం. తెలంగాణ వచ్చిన రోజు రాష్ట్రం చుట్టూ చీకట్లే. అలాంటి నేపథ్యంలో సింగరేణి సాయంతో కేసీఆర్ 24 గంటల విద్యుత్ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారు. కానీ.. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు ఇప్పుడు ఏడుస్తున్నారు. మోసపోతే గోస పడతామని కేసీఆర్ ఆనాడే చెప్పారు. కేసీఆర్ మాటలను ప్రజలు పెడచెవిన పెట్టారు. కరెంట్ కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది' అంటూ కేటీఆర్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

# బ్లూ డ్రమ్ మర్డర్ కేసు.. నిందితులు ముస్కాన్, సాహిల్‌కు మరణశిక్ష



దేశంలో సంచలనం సృష్టించిన మీరట్, బ్లూడ్రమ్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులు ఇద్దరికీ మరణశిక్ష విధిస్తూ మీరట్‌కు చెందిన జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు జిల్లా కోర్టు జడ్జి అరవింద్ కుమార్ మిశ్రా తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణ గత సెప్టెంబర్ 30న పూర్తికాగా.. నిందితులు ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా నేరానికి పాల్పడ్డట్లు తేలింది.దీంతో ఆరోజు తీర్పు రిజర్వ్ చేయగా, నేడు తీర్పు వెల్లడించారు. ఈ ఘటనలో హత్యకు గురైంది రస్తోగి భర్త సౌరభ్ భరద్వాజ్. తీర్పు వెలువడుతున్న సమయంలో జిల్లా జైలులో ఉన్న నిందితులు ఇద్దరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. బ్లూ డ్రమ్ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఉత్తర ప్రదేశ్, మీరట్‌కు చెందిన నేవీ మాజీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్.. 2025, మార్చి 3న హత్యకు గురయ్యాడు. అతడి భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి సౌరభ్‌ను హత్య చేశారు.తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో సౌరభ్‌ను హత్య చేశారు. అనంతరం అతడి మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఒక బ్లూ డ్రమ్‌లో ఉంచారు. పైనుంచి సిమెంట్ పోసి, కప్పేశారు. దీంతో అతడి మృతదేహం అందులోనే కూరుకుపోయింది. ఘటన జరిగిన కొన్ని రోజులకు పోలీసులు అన్ని కోణాల్లో విచారించగా ఈ హత్య ఘటన బయటపడింది. సౌరభ్‌ను ముస్కాన్, ఆమె క్లాస్‌మేట్, ప్రియుడు సాహిల్ కలిసి హత్య చేసినట్లు తేలింది. దీనిపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభమైంది.మొత్తం 13 నెలల్లోనే ఈ కేసు విచారణ పూర్తై, తీర్పు వెలువడటం విశేషం. ఈ కేసులో 126 వాదోపవాదాలు జరిగాయి. 22 మందికిపైగా సాక్షుల్ని కోర్టు విచారించి, చార్జిషీటు దాఖలు చేసింది. దీనిపై ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పు వెలువడింది.

## జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా రాహుల్, ప్రతిపక్షాల పిటిషన్..

### రిజిష్టర్ చేసిన సుప్రీంకోర్టు



సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతోపాటు ఇండియా బ్లాక్‌కు చెందిన 11 పార్టీలు కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌కు సుప్రీంకోర్టు రిజిష్టర్ చేసి, విచారణకు స్వీకరించింది. దీని ప్రకారం అక్టోబర్ 26న కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది.ుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా ఈ పిటిషన్‌కు ఒక రిట్ నెంబర్ రావడంతో, వరుస ప్రకారం విచారణ మొదలవుతుంది. ఈ పిటిషన్‌ను మొదట రాహుల్ గాంధీ, ఆ తర్వాత మరో 11 పార్టీలు కలిసి దాఖలు చేశాయి. ఆ తర్వాత టి.తిరుమవలవన్, సజ్జాద్ అహ్మద్ కిచ్లూ కలిసి పిటిషన్లో చేరారు. దీంతో ఈ పిటిషన్ దాఖలు చేసిన వారి సంఖ్య 13కు చేరింది. భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు, సర్‌లో అవకతవకలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా వంటి అంశాలతో ఈ పిటిషన్ దాఖలైంది.అయితే, ఈ పిటిషన్‌లో 14 తప్పులు ఉన్నట్లు సుప్రీంకోర్టు రిజిష్ట్రీ తెలిపింది. దీంతో పిటిషనర్లకు సంబంధించి తగిన ధృవపత్రాలు సమర్పించాలని సంబంధిత న్యాయవాదికి సూచించింది. తగిన కోర్టు ఫీజు (రూ.220) కూడా చెల్లించలేదని తెలిపింది. అనంతరం వీటిని సరిదిద్దడంతో సుప్రీంకోర్టు కేసు రిజిష్టర్ చేసినట్లు తెలుస్తోంది.

## టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు..

– రూ.130 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ



అమరావతి, అక్టోబర్ 14: తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేవస్థానానికి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన బోలేబాబా, వైష్ణవి డెయిరీ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.టీటీడీకి రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో భోలే బాబా, శ్రీ వైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్‌కు చెందిన ఆస్తుల అటాచ్ చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. ఈ సంస్థలు టెండర్లలో పాల్గొన్న ఫ్రంట్ డెయిరీల ద్వారా టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు గుర్తించామని ఈడీ వెల్లడించింది. నకిలీ కొనుగోళ్లు, అమ్మకాలతో లావాదేవీలను నిజమైనవిగా చూపించినట్లు గుర్తించామని తెలిపింది. బ్యాంకు లావాదేవీల ద్వారా చెల్లింపులు చేసి, హవాలా మార్గంలో నగదు వెనక్కి మళ్లించారని భావిస్తోన్నట్లు అధికారులు తెలిపారు. సంస్థల ప్రమోటర్లు విపిన్ జైన్, కైలాష్ చంద్ర మంగ్లా, వారి కుటుంబ సభ్యుల ఆస్తులపైనా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు.

## డ్రగ్స్ వ్యతిరేక కార్యకర్త హత్య కేసు..

### నిందితుడి ఇల్లు కూల్చివేత.. షాపు దహనం



పంజాబ్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న సామాజిక కార్యకర్త పర్విందర్ సింగ్ జోటా హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ హత్యకు పాల్పడిన నిందితుడి ఇంటిపై పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం బుల్డోజర్ చర్యకు దిగింది. నిందితుడు అశ్వని కుమర్ ఇంటిని ప్రభుత్వం కూల్చేసింది. అతడి మెడికల్ షాపును నిరసనకారులు తగులబెట్టేశారు. పంజాబ్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త పంజాబ్‌లోని పర్విందర్ సింగ్ జోటా మంగళవారం మాన్సా జిల్లాలో హత్యకు గురయ్యాడు.
అది కూడా ఫేస్‌బుక్ లైవ్‌లో ఈ ఘటన జరిగింది. ఒక మెడికల్ షాపులో డ్రగ్స్ విక్రయిస్తుండటాన్ని పర్విందర్ ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన మెడికల్ షాపు ఓనర్ అశ్వని కుమార్ తన దగ్గరున్న పిస్టల్‌తో పర్విందర్ సింగ్‌ను కాల్చి చంపాడు. ఇది లైవ్ స్ట్రీమింగ్‌లో జరిగింది. ఈ ఘటన అనంతరం నిందితుడు అశ్వని కుమార్ పారిపోయాడు. పోలీసులు పర్విందర్ సింగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ హత్యపై పెద్దపెత్తున విమర్శలు వెల్లువెత్తాయి. పంజాబ్ వ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో పోలీసులు వేగంగా స్పందించారు.బుధవారం నిందితుడిని అరెస్టు చేశారు. మరోవైపు స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుండటంతో ప్రభుత్వం బుల్డోజర్ చర్యకు దిగింది. అతడి ఇంటిని ప్రభుత్వం బుల్డోజర్‌తో కూల్చేసింది. ఇదే సమయంలో ఈ ఘటన జరిగిన మెడికల్ షాపు వద్ద పలువురు ఆందోళనకారులు అతడి మెడికల్ షాపును, పరిసరాల్ని తగులబెట్టేశారు. ఇదే సమయంలో మెడికల్ షాపు నుంచి నిషేధిత ఔషధాల్ని కూడా ఆందోళనకారులు గుర్తించారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు భారీ స్థాయిలో మోహరించారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బీసీ, ఈబీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం మరో అవకాశం



హైదరాబాద్, అక్టోబర్ 14: రాష్ట్రంలో బీసీ, ఈబీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించింది. అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 31 వరకు దరాఖస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2026 ఫాల్ సెషన్‌లో విదేశాల్లో చదవాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.
ఈ పథకం ద్వారా విదేశాల్లో మాస్టర్స్, డాక్టోరల్ కోర్సుల కోసం విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఇందుకోసం దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 ఏళ్లకు మించకూడదు. గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 260 లేదా 550 స్కోర్ సాధించి ఉండాలి. అలాగే 60 లేదా  6.0 లేదా ్రాజు 50 స్కోర్ కలిగి ఉండాలి. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులకు అక్టోబర్ 31, 2026 చివరి తేదీగా నిర్ణయించారు.

## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

### క్యాబినెట్ కమిటీ ఆమోదం




: రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 78 రోజుల బోనస్ ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం క్యాబినెట్ సమావేశమైంది. రైల్వే శాఖలోని మొత్తం 11,40,770 మంది ఉద్యోగులకు 78 రోజుల బోనస్ ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకోసం రూ.2009.61 కోట్లను కేంద్రం ఖర్చుపెట్టనుంది. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పనితీరుకు గుర్తింపుగా బోనస్ ఇవ్వాలని నిర్ణయించామని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతీ సంవత్సరం దసరా పండగకు ముందు ఉద్యోగులకు బోనస్ ఇచ్చినట్లే ఈసారి కూడా పండుగకు ముందే బోనస్ ఇస్తామని వెల్లడించింది. దీంతో ఉద్యోగులు మరింత మెరుగ్గా పనిచేసేందుకు ఈ బోనస్ ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొంది. కాగా.. క్యాబినెట్ నిర్ణయంతో అర్హులైన ప్రతి రైల్వే ఉద్యోగికి గరిష్టంగా 78 రోజులకు రూ.17,951 బోనస్‌గా అందనుంది. రైల్వే శాఖలోని ట్రాక్ మెయింటనర్లు, లోకో పైలట్లు, ట్రెయిన్ మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మన్, మినిస్టీరియల్ స్టాఫ్, గ్రూప్ సీకి చెందిన ఇతర సిబ్బందికి ఈ బోనస్ చెల్లిస్తారు. కాగా.. 2025–26 సంవత్సరంలో రైల్వేల పనితీరు బాగుందని యూనియన్ క్యాబినెట్ తెలిపింది. ఆ సంవత్సరంలో 1670 మిలియన్ టన్నుల కార్గోను రైల్వే రవాణా చేసిందని, అలాగే 7.41 బిలియన్ ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించారని వివరించింది.

## ఫలించిన సింగిరెడ్డి వ్యూహం..

### ఎట్టకేలకు పాలమూరు లిఫ్ట్ ప్రారంభం



మహబూబ్‌నగర్ : ఆది నుంచి రైతు పక్షాన పోరాటాలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతి నిధుల వ్యూహాలు ఫలిస్తున్నాయి. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రోడ్లపై పోరాటాలు చేస్తూనే మరోవైపు అధికార కాంగ్రెస్‌కు చేస్తున్నహెచ్చరికలతో ప్రభుత్వం దిగి వస్తుంది.పాలమూరు పంపులు ప్రారంభించాలని, నార్లపూర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు అనుసంధానం చేసి ఎల్ నినో ఇబ్బందులు తొలగించాలని బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జిల్లా నాయకుల రైతుల తరుపున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులు ప్రారంభించి రైతులను ఆదుకోకుంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలసి నార్లాపూర్‌ను ముట్టడిస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. బుధవారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులు ప్రారంభించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. నార్లాపూర్ రిజర్వాయర్‌లో 6.5 టీఎంసీల నీరు నిండేంత వరకు పంపులు ఆపొద్దని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు

### ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 14: బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల అవినీతిని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరించారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈరోజు (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. తొమ్మిది జిల్లాల్లో బీఆర్ఎస్ భూములు, హోటల్స్ అన్నీ బయట పెట్టారన్నారు. తమ వాయిస్ టాంపరింగ్ చేసి సోషల్ మీడియాలో బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు.ఏనుగు ఎక్కి ప్రగతి భవన్‌కు వెళ్తానని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఫాంహౌస్‌లో బందీ అయ్యారని ఎంపీ విమర్శించారు. 'నా పేరు మీద అసైన్డ్ భూములు ఉన్నా, 22ఏ జాబితాలో ఉన్నా, ఇల్లీగల్ భూములు ఉన్నా అక్కడికి మీరు వెళ్లండి. అక్కడే అధికారులను పిలిచి రాసి ఇచ్చేస్తా. తెలంగాణ సమాజానికి నన్ను విలన్‌గా చూపించాలని మాజీ ఐపీఎస్ ఆఫీసర్ మాట్లాడారు. అమెరికాలో 6 ఏళ్లు ఉండి ఫైవ్ స్టార్ హోటల్ కట్టుకున్నా అని కేటీఆర్ చెప్పారు. ఇంత తెలివి ఉన్న కేటీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పాలిస్తే రూ.8 లక్షల కోట్ల అప్పు ఎలా అయింది' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఆర్టిస్టుల డ్రామాలు బంద్ చేయాలంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ హితవుపలికారు.

# కార్పొరేట్ పాఠశాలల్లో ఆస్ట్రేలియన్, కేంబ్రిడ్జ్ కరికులాల పేరుతో అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలి

**విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు చేపట్టాలి**

**బీసీ సంఘాల నాయకుల డిమాండ్**



కరీంనగర్ ప్రతినిధి నీలగిరి వార్త కరీంనగర్ జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విదేశీ కరికులం(ఆస్ట్రేలియన్,కేంబ్రిడ్జ్) పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఫీజుల భారం మోపే ప్రయత్నాలను అరికట్టాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాధికారిని కలిసి ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఇప్పటికే వరల్డ్ స్కూల్, ఇంటర్నేషనల్ స్కూల్, హెరిటేజ్ స్కూల్, ఈ-టెక్నో స్కూల్ వంటి పేర్లతో కొన్ని విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు కేంబ్రిడ్జ్ , ఆస్ట్రేలియన్ కరికులం పేరుతో కొత్త విధానాలను ప్రవేశపెట్టి, విద్యను మరింత ఖరీదైనదిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య అనేది ప్రతి బిడ్డకు అందాల్సిన హక్కు అని, దానిని కేవలం వ్యాపారంగా మార్చడం తగదని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే అధిక ఫీజుల కారణంగా పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొత్త కరికులం పేరుతో అదనపు ఫీజులు వసూలు చేస్తే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆటస్థలాలు ఉన్నాయా లేదా అనే అంశంపై అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని బీసీ సంఘాల నాయకులు కోరారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఆటలు, క్రీడలు, విశాలమైన వాతావరణం ఎంతో అవసరమని, అలాంటి కనీస సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.విదేశీ కరికులం పేరుతో నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోని రాష్ట్ర మరియు సీబీఎస్ఈ కరికులం సక్రమంగా బోధించాలని కోరారు.

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన అందిస్తున్నారని సీబీఎస్ఈ కరికులం కూడా ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తమ పరిధిలోని పాఠశాలల పై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యమైన బోధన.విద్యార్థులకు అందేవిధంగా చర్యలు చేపట్టి బడుగు బలహీన వర్గాల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, మియాపురం రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మావోయిస్టుల పెట్టుబడులతో పేకాట స్థావరాలు

**జూదం నిర్వాహకులు మంచిర్యాల జిల్లా వారే..**

**సిరోంచ అడ్డగా రమ్మీ సిండికేట్ పేకాట..**

**చెస్, క్యారమ్, స్నూకర్స్, టేబుల్ టెన్నిస్ క్లబ్ పేరుతో చట్టవిరుద్ధమైన క్లబ్'లు ఏర్పాటు..**

**రోజు కోట్ల రూపాయల పేకాట..**

**నిన్నటి వరకు మంచిర్యాల జిల్లాలో నేర సామ్రాజ్యాన్ని నడిపిన వ్యక్తులే అక్కడ నిర్వాహకులు..**

**లెక్కల్లో లేని డబ్బుతో కోల్ బెల్ట్ లో నాయకులు మాత్రమే కాదు రాజకీయ పార్టీలు పుట్టుకవస్తాయి.**

నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి అనిల్ భగత్ : తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, భూపాలపల్లి, మంతెన, ఖమ్మం, పాల్వంచ, మహబూబాద్, కరీంనగర్, పెద్దపల్లి, సిద్ధిపేట, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ నుండి మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుండి సైతం వస్తున్న వందలాది వాహనాలు సిరోంచ వద్ద ఆగడం కనిపిస్తుంది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంటే నిన్నటి వరకు ఉద్యమకారులను అక్కున చేర్చుకున్న అమాయక ఆదివాసి ప్రజానీకం అక్కడ అత్యధికంగా కనిపిస్తారు. మొదటి తరం నక్సలైట్ కొండపల్లి సీతారామయ్యా, కేజీ సత్యమూర్తి, ముప్పల లక్ష్మణ్ రావు, మల్లోజుల కోటేశ్వర్ రావు సహా అనేకమంది మావోయిస్టులకు సురక్షితమైన ప్రాంతంగా గాడ్చిరోలికి పేరుంది. మావోయిస్టు పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు నుండి అనేకమంది లొంగిపోయిన మావోయిస్టులు నివసిస్తున్న ప్రాంతం గాడ్చిరోలి జిల్లా కావడం అత్యంత కట్టుదిట్టమైన భద్రత బలగాలు డేగ కన్నులతో నిరంతరం కాపుగయడం అక్కడ చూడవచ్చు. అలాంటి భద్రత ఉన్న సిరోంచ ప్రాంతం నిన్నటి వరకు ఇసుక మాఫియా, బియ్యం మాఫియాకు మాత్రమే పరిమితం కాగా ఇప్పుడు హినియస్ క్రైమ్స్ మన కళ్ల ముందే నడుస్తున్న పేకాట నేర ప్రపంచాన్ని చూసీచూడనట్టు యంత్రాంగం వదిలేస్తుంది. చెస్, క్యారమ్, స్నూకర్స్, టేబుల్ టెన్నిస్ పేర్లతో లీగల్ గా ఏర్పాటు చేసిన క్లబ్ లు చట్టవిరుద్ధమైన రమ్మీ సిండికేట్ ఆటలకు అడ్డగా మారాయి. ప్రతీరోజూ మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ఇరువై టేబుల్ ఆటతో, టేబుల్ కు 8 మందితో 45నిమిషాలకు ఒక్క ఆటను కాయిన్స్ రూపంలో నడుపుతున్నారు నిర్వాహకులు. రోజు కోట్ల రూపాయలు దోచుకుంటూ మందు, విందు, వన్యప్రాణుల మాంసపు వంటకాలతో ఈ పేకాట క్లబ్ లు నడుపుతూ గోవా వంటి ప్రాంతాలో నడిచే క్యాసినో ఆటను మైమరిపిస్తోంది అంట సిరోంచ పేకాట స్థావరాల సదుపాయాలు. ఆటకు తీసుకువస్తున్న డ్రైవర్లకు, వాహనాలకు 2500 నుండి 5000, 10000 వరకు నిర్వాహకులు చెల్లిస్తూ కోట్ల రూపాయల ఆటలు ఆడిస్తున్నారు. చట్టవిరుద్ధమైన క్లబ్ లను ఏర్పాటు చేసి రమ్మీ సిండికేట్ ఆటలు నడుపుతున్న ముఠా శక్తులు కోల్ బెల్ట్ లోని మాజీ మావోయిస్టులకు సమీప వ్యక్తులు కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. నిన్నటి వరకు మంచిర్యాల జిల్లాలో నేర సామ్రాజ్యాన్ని నడిపిన ముఠా బృందం మంచిర్యాల జిల్లాలోని మాజీ మావోయిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, యూనియన్ నేతలు, భూ మాఫియా బృందాలు, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తులు పెట్టుబడులు పెట్టిన క్లబ్ లను కంటికి రెప్పలా ఈ ముఠా కాపాడుకుంటున్నారు. ఆటలో ఎవ్వరైనా ప్రశ్న లేవదీస్తే ఇక వారిని ఇష్టం వచ్చిన తీరులో కొట్టిన సందర్భాలు లేకపోలేదు. సామాన్యుల నుండి ప్రభుత్వ ఉద్యోగులు చివరకు పోలీసులను చితకబాదిన సందర్భాలు ఉన్నాయి.

దూరప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు మంచిర్యాల, కాళేశ్వరం హోటల్స్ లో ఉంటూ ముందు రోజు ఆటలో పోయిన డబ్బుల కోసం మరుసటి రోజు ఆడటం తిరిగి




లక్షల రూపాయలు అప్పులు చేయడంతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతు న్నాయి. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్న మాట లు పక్కన పెట్టేసి నాన్ స్టాప్ న్యూసెన్స్ తో సిండికేట్ అయిన కొందరు మరాఠీ ఉద్యోగుల కారణంగా కోల్ బెల్ట్ లోని చిన్న చిన్న పాములు కాస్త మహారాష్ట్ర సిరోంచ పుట్టలో పెద్దపెద్ద నల్ల త్రాచుల్లా మారి సమాజాన్ని కబళించెయ్యడం అంటువ్యాధుల తలపిస్తుంది. జూదం నిర్వాహకులు మంచిర్యాల వారు కావడం ముఖ్యంగా మాజీ మావోయిస్టులు, వారి అనుచర ముఠా శక్తులు కావడంతో లెక్కలో లేని ఈ అక్రమ డబ్బుతో ఏదైనా రాజకీయ పార్టీకి నిధులు ఇస్తారా లేక కొత్త రాజకీయ పార్టీ పెడతారా అనే ప్రశ్నలు సరిహద్దు ప్రాంతాల ప్రజల నుంచి తీవ్రంగా చర్చకు తెరలేపింది. వేచిచూడాలి మాన్య శ్రీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం మునుముందు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో..

# కుల పెద్దల తీర్పుతో ఓ కుటుంబం సామాజిక బహిష్కరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కుల పెద్దల తీర్పుతో ఓ కుటుంబం సామాజిక బహిష్కరణకు గురైందంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. స్థలం వివాదం కాస్తా కుల బహిష్కరణ వరకు వెళ్లిందని ఆరోపిస్తున్నాడు. పండుగలు, శుభ, అశుభ కార్యక్రమాలకు తమ కుటుంబాన్ని పిలవడం లేదని వాపోతున్నాడు. అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో చోటుచేసుకుంది.కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామానికి చెందిన దర్నీ పోచయ్య తనకు కేటాయించిన ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పక్కనే నివసించే రెండు కుటుంబాలతో స్థలం, దారి విషయంలో గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోందనీ, ముగ్గురు కుటుంబాలకు ఒకే దారి ఉండగా, తన రాకపోకలకు అడ్డుగా గోడ నిర్మించారని పోచయ్య ఆరోపిస్తున్నాడు. ఇంటి వద్ద బాత్‌రూమ్ నిర్మించుకోవడానికి సైతం అడ్డుకున్నారని తెలిపాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కుల పెద్దల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. అయితే కుల పెద్దల సమక్షంలో జరిగిన చర్చల్లో ఏకపక్షంగా వ్యవహరించి తనకు 20 వేల జరిమానా విధించారని ఆరోపించాడు. అప్పటి నుంచి తమ కుటుంబాన్ని కులంలో జరిగే పండుగలకు, శుభ, అశుభ కార్యక్రమాలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కుల పెద్దలకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపాడు. ఈ నెల 5వ



తేదీన స్థానిక తహసీల్దార్ పోలీస్ స్టేషన్లో కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని ఆరోపించాడు. తమ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించిన వారిపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దర్నీ పోచయ్య అధికారులను కోరుతున్నాడు.

## అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థి ఎంపిక




కరీంనగర్ ప్రతినిధి నీలగిరి వార్త , శ్రీలంకలో ఈ నెల అనగా 2026 అక్టోబర్ 16, 17 తేదీలలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన కరాటే క్రీడాకారుడు కె. ఆదిత్య సాయి ఎంపిక య్యాడు. సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్ ఆదిత్య సాయిని అభినంది ంచారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశా లకు, తల్లిదండ్రులకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని తెలిపారు.అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుని, అద్భుతమైన ప్రదర్శనతో విజయం సాధించి పాఠశాలకు, మన దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆదిత్య సాయికి శుభాకాంక్షలు తెలియజేశారు.కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఆదిత్య సాయిని అభినందిస్తూ, పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## బ్రెయిన్ డెడ్ తో మరణం నలుగురికి పునర్జన్మనిచ్చాడు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: ఓ వ్యాపారవేత్త బ్రెయిన్ డెడ్ కాగా, అవయవ దానంతో నలుగురు రోగులకు పునర్జన్మ లభించింది. కామారెడ్డిలో పట్టణంలోని రాజానగర్ నివాసి పవన్ కుమార్ జాజు (39) వృత్తిరీత్యా వ్యాపారవేత్త. కొన్ని రోజులుగా తలనొప్పితో బాధపడుతున్నాడు. పవన్? కుమార్? జాజుకు అకస్మాత్తుగా బ్రెయిన్ హెమరేజ్ కావడంతో ఈనెల 7న కామారెడ్డిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. ఇంతటి విషాద సమయంలోనూ పవన్ కుమార్ కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. దీంతో అతడి రెండు కిడ్నీలు, లివర్, ఊపిరితిత్తులను నలుగురు రోగులకు అమర్చి వారి ప్రాణాలను కాపాడారు. ఈ సందర్భంగా జీవన్ దాన్ తెలంగాణ ఇన్?ఛార్జి ప్రొఫెసర్ భూషణ్ రాజు మాట్లాడుతూ.. బాధిత కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి నిర్ణయం స్ఫూర్తిదాయకమన్నారు. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, అవసరమైన వారికి సేవలు అందించేందుకు జీవన్ దాన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## భైరవ సేన 2వ వార్షికోత్సవంలో దుర్గాదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

భైరవ సేన 2వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన దుర్గాదేవి పూజా కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భైరవ సేన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ, కామారెడ్డి నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు మెహర్ బాబా గౌడ్ అరవింద్,భైరవ సేన సభ్యులు,నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి జిల్లాలో జిల్లా యువజన, క్రీడల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ సంబరాలను ప్రారంభించిన అనంతరం, మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికంగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించేలా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఇటువంటి వేడుకలు ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణలో కలెక్టర్ రవితేజ, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా మద్య నిషేధ శాఖ అధికారి ముకుంద రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రంగ వెంకటేశ్వర గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దామోదర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమాత బోనాలు,పల్లకి సేవ లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి 10 వ వార్డులో దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు,అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి పల్లకిని స్వయంగా మోసి భక్తిని చాటుకున్నారు.బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో మున్సిపాలిటీ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.దుర్గమాత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యం తో అందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో దుర్గా సేవాసమితి నిర్వాహకులుఅక్షయ్,నూతన్,మధు, శ్యామ్,నరేం దర్,వినీత్, లడ్డు,రోహిత్,బంటి,తేజ, సంజయ్,సందీప్,శశి, నరేష్,శ్రీధర్, పండు,సంజీవ్, గణేష్,శ్రుతి,సంతోషిని, అక్షయ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలునాయక్ ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి

పట్టభద్రుల ఓటరు నమోదు, పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తా ఎమ్మెల్యే



దేవరకొండ నీలగిరి వార్త ఉమ్మడి నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ వచ్చేలా సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, పార్టీ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు పెంచేందుకు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి శ్రేణులతో కలిసి దేవరకొండ నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని సూచించారు.

# సమన్వయంతో స్పందించి.. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన దేవునిపల్లి, రామారెడ్డి పోలీసులు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణ సహా యం అందించడంలో కామారెడ్డి జిల్లా పోలీసులు మరోసారి తమ అంకిత భావాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. 'డయల్ 112'కు అందిన అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించి, రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నిస్తున్న వ్యక్తిని సమయస్ఫూర్తితో సముదాయించి నిండు ప్రాణాన్ని కాపాడారు. కామారెడ్డి జిల్లా పోసానిపేట్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవితంపై విరక్తి చెంది అడ్లూరు శివారులోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు 'డయల్ 112'కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తక్షణమే దేవునిపల్లి పోలీసు సిబ్బంది (పి సి రమేష్, హెచ్ జి భూపతి) అత్యంత అప్రమత్తమయ్యారు. బాధితుడికి ఫోన్ చేసి నిరంతరం సంభాషిస్తూ, అధైర్యపడ వద్దని ధైర్యం చెబుతూ సముదాయించారు. అదే సమయంలో రామారెడ్డి పెట్రోల్ కార్ ఏఎస్ఐ పందరి గౌడ్ తో సమన్వయం చేసుకుంటూ, సాంకేతిక సమాచారం ఆధారంగా బాధితుడు ఉన్న ఖచ్చితమైన స్థానాన్ని వేగంగా గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు. అనంతరం రామారెడ్డి పెట్రోల్ కార్ సిబ్బంది సహకారంతో బాధితుడిని సురక్షితంగా ఆయన ఇంటికి చేర్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన సిబ్బంది సమయస్ఫూర్తిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర కామారెడ్డి డిఎస్పి మధుసూదన్ ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ:

"జీవితం ఎంతో విలువైనది, దాన్ని అర్ధాంతరంగా ముగించుకోవద్దు. వ్యక్తిగత సమస్యలు, ఒత్తిళ్లు ఎదురైనప్పుడు కుంగిపోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా ఆత్మీయులతో మనసులోని బాధను పంచుకోవాలి. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదు. మీ చుట్టూ ఉన్నవారు ఎవరైనా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతుంటే వారికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం అందించండి. ఆపదలో ఉన్నవారు తక్షణ సహాయం కోసం




ఎప్పుడైనా 'డయల్ 112' కు కాల్ చేయవచ్చు. ప్రజల ప్రాణాలను కాపాడటానికి కామారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

వ్యవసాయ విద్యుత్ కోతలతో రైతులకు తీవ్ర నష్టం

ఎండిపోతున్న పంటలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

పడమటిపల్లి సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్





దేవరకొండ నీలగిరి వార్త

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ మండలంలోని పడమటిపల్లి సబ్‌స్టేషన్ వ్యవసాయ విద్యుత్ కోతలకు నిరసనగా రైతులు చేపట్టిన సబ్ స్టేషన్ ముట్టడి కార్యక్రమంలో ఆయన సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్న సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, వాటిని కాపాడుకునేందుకు అవసరమైన విద్యుత్ అందకపోవడం బాధాకరమన్నారు.గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సందర్భాల్లో వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించి, రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన విద్యుత్ అందించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సాగునీరు, విద్యుత్ కొరతతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వ్యవ సాయ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు .ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలి

అని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా నాణ్య మైన విద్యుత్ సరఫరా చేయాలని, కాలిపో యిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలని, పంట నష్టపోయిన రైతులను గుర్తించి అర్హులకు నష్టపరిహారం అందించాలని రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి,సర్పంచులు మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,నాగవరం వెంకటేశ్వర్ రావు, తోటకూర వెంకటయ్య, తిరుపతి నాయక్,సంకూ కొండల్ రెడ్డి, దేప శైలేందర్ రెడ్డి,కొమ్ము రామస్వామి ,నూతనకంటి రఘు,పాత్లవత్ దాస్రూ నాయక్, జెల్ల రేణు గౌడ్,సూరి, యాదయ్య,చరణ్,తదితరులు పాల్గొన్నారు.

# 16న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

33 మంది పూర్వ విద్యార్థులు సన్మాన గ్రహీతలుగా ఎంపిక

సమ్మేళనంలో ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ పూర్వ విద్యార్థుల సేవకు సత్కారం



ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి అక్టోబర్14: ప్రతి ఏటా నిర్వహించే పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో 16విభాగాలలో ప్రతిభ కనబరిచిన పూర్వ విద్యార్థులను సన్మానించి గౌరవించడం ద్వారా కళాశాల గౌరవం ఇనుమడింపజేయాలని ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించింది. అనేక రంగాలలో కళాశాల పూర్వ విద్యార్థులు తమ తమ సేవలను సమాజానికి అందించి కళాశాలకు గుర్తింపు తెచ్చారు. సమాజ సేవలో భాగంగా వారు చేసిన సేవలను కార్యవర్గం గుర్తించింది. ఈ ఏడాది ఈ నెల 16న నిర్వహించే రెండవ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో సన్మానంకుగాను కొందరు పూర్వ విద్యార్థి ప్రముఖులను కార్యవర్గం ఎంపిక చేసింది. వీరిని కార్యక్రమంకు హాజరైన సీనియర్ సభ్యులు సత్కరిస్తారు. అనంతరం వారి సందేశాలు ఉంటాయి. ఈఏడాది సన్మానం గ్రహీతలుగా 16 రంగాల నుండి మొత్తం 33 మందిని ఎంపిక చేసినట్లు కార్యవర్గం ప్రకటించింది!

ఎంపిక చేసిన సన్మాన గ్రహీతలు వీరే

ప్రజాప్రతినిధుల వర్గానికి చెందిన కొండబాల కోటేశ్వరరావు (మదిర మాజీ శాసనసభ్యులు), నల్లగట్ల స్వామి దాస్ (తిరువూరు మాజీ శాసనసభ్యులు), ఉద్యమ నాయకత్వం నుండి గాదె మాధవరెడ్డి (దివాకర్), మహమ్మద్ ముజఫరుద్దీన్, అడ్వకేట్ జహీర్ ఆలీ. శాస్త్ర వెత్తల వర్గానికి చెందిన నేదునూరి నర్సింహారావు (సిఇఒ బయోటెక్ కంపెనీ), మద్దినేని మన్మధరావు(రిటైర్ ఇస్రో శాస్త్రవెత్త), విద్యా వెత్తలుగా శివరామయ్య(భీమవరం, డిఇడి కళాశాల ప్రిన్సిపాల్), కనకాచారి(పిజి కళాశాల ఎక్స్ ప్రిన్సిపాల్), ప్రొ.వినుకొండ తిరుమలి (రిటైర్ ప్రొఫెసర్), న్యాయవాద వర్గానికి చెందిన వడ్డెల్లి కృష్ణమూర్తి (సీనియర్ అడ్వకేట్) ,కడారు ప్రభాకరరావు (హైకోర్టు న్యాయవాది), మదార్(రిటైర్ జడ్జి), కళాకారుల వర్గం నుండి యం.పుల్లయ్య( కళాశాల మాజీ కల్చరల్ సెక్రటరీ), గాలి శెట్టి వేణుగోపాల్ (ప్రఖ్యాత కార్టూనిస్ట్), పమ్మిరవి(సాంస్కృతిక సారథి), రచయితల వర్గం నుండి జీవన్(నర్సింహ చారి, రచయిత), మువ్వా.శ్రీనివాసరావు(కవి), పత్రికల వర్గానికి చెందిన కట్టెకోల చిన నరసయ్య( జర్నలిస్ట్ ), భూపాల్ (యన్ టీవి), సామాజిక కార్యకర్తలుగా వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్ (బాలకార్మిక వ్యవస్థ), కె.సీతారాములు(రిటైర్ అడిషనల్ యస్పి), దగ్గుల మాధవరెడ్డి(సామాజిక కార్యకర్త), మహిళా సేవా రంగం నుండి కావూరి హిమబిందు (మహిళా సంఘాలు), ధీకొండ చంద్రకళ (కవి), వైద్యరంగం నుండి ఎస్.కె బాబ్జాన్ (చెవి,ముక్కు, గొంతు వైద్యులు),వ్యాపార రంగం నుండి వ్యాపారవేత్త కుంచకర్ర నగేష్, క్రీడారంగం నుండి పిల్లి రాజు, సమకాలీన ప్రతిభ కనపరచిన నాళ్ళబానూచందర్, సీనియర్ సిటిజన్ స్ఫూర్తి యన్ యస్ సి. బోస్ (రిటైర్ యంఇఓ,ఇల్లెందు),చెల్ది బాబూరావు (రిటైర్ హెడ్మాస్టర్), కార్మిక రంగం నుండి ఆవుల నాగేశ్వరరావు, రైతు వర్గం నుండి మల్లేల సన్మత్ రావులను(నేల పట్ల అగ్రహారం) పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఘనంగా సత్కరించనున్నట్లు కార్యవర్గం తెలిపింది. ఈ సమ్మేళన కార్యక్రమాని కి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ కోరింది

# రహదారిపై కొండచిలువ మృతి

## రాత్రి సమయం విషసర్పాలు రోడ్లపైకి



దేవరకొండ నీలగిరి వార్త
వేసవి తీవ్రత కారణంగా చెట్ల పొదలలో తలదాచుకోవాల్సిన విష సర్పాలు రోడ్డు ఎక్కుతున్నాయి దీంతో అతిపెద్ద కొండచిలువ గా భావిస్తున్న విష సర్పం రోడ్డు పైకి వచ్చి ప్రమాదవస్తు రోడ్డుపై మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతం గుండా వెళ్లేటువంటి వాహనదారులు కొండచిలువగా భావిస్తున్న అతిపెద్ద విష సర్పాన్ని గుర్తించడంతోపాటు ప్రాణాపాయాల నుండి తప్పించుకున్నట్లు అయింది
దేవరకొండ కొండమల్లేపల్లి ప్రధాన రహదారిపై మార్కండేయ స్వామి దేవాలయం సమీపంలో గురువారం రాత్రి కొండచిలువ మృతి చెందింది. రహదారి దాటుతున్న కొండచిలువను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. రహదారిపై కొండచిలువ మృతి చెందడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఈ ఘటనను గమనించారు. వన్యప్రాణుల సంచారం ఉండే ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. దీనిపై వెటర్నరీ వైద్యులు నిర్ధారించి వివరాలు తెలియజేయాల్సి ఉంది.

# పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు నడికూడ, ఆత్మకూర్, దామెర, గీసుగొండ మండలాలు మరియు 15,16 డివిజన్ల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు దనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,మహాలక్ష్మి ,గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

# బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి.

**చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
బతుకమ్మ వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో, ప్రశాంతంగా జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.బుధవారం గ్రేటర్ వరంగల్ లోని చిన్నవడ్డేపల్లి, బేస్తం చెరువు, ఉర్స్ చెరువు, బంధం చెరువు, పద్మాక్షి గుండం తదితర చెరువుల ప్రాంతాల వద్ద బతుకమ్మ ఏర్పాట్లను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించి, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీరు, భద్రత, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలపై కీలక సూచనలు చేశారు.అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు సంజయ్ కుమార్, రవికుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దీపావళి పండుగకు జరిగే ఉర్సు గుట్ట నరకాసుర వద ఉత్సవములకు

**స్థానిక ఎమ్మెల్యేతో పాటు అందరి సహకారం తీసుకొని ముందుకు వెళ్తాం.**

**నరకాసుర ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 6 వ తారీఖున ఉర్సు గుట్ట కూడా మైదానంలో సాయంత్రం జరుగు నరకాసుర వధ ఉత్సవములు అతి వైభవంగా నిర్వహించుటకు వరంగల్ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యురాలు కొండా సురేఖ మురళీధర్ రావు సహకారం తీసుకుంటామని నరకాసురవ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల రవి అన్నారు బుధవారం రోజున ఉర్సు ప్రతాప్ నగర్ లో జరిగిన కార్యవర్గ సమావేశానికి అధ్యక్షులు మరుపల్ల రవి అధ్యక్షత వహించి మాట్లాడినారు అధ్యక్షులు మరుపల్ల రవి మాట్లాడుతూ నరకాసురవద ఉత్సవములు నిర్వహించాలంటే ప్రభుత్వ సహకారం ఎంతైనా అవసరమని తగు ఏర్పాట్లకుస్థానిక శాసన సభ్యురాలు కొండ సురేఖ మురళీధర్ రావు కూడా చైర్మన్ గుండు సుధారాణి జిల్లా కలెక్టర్లు సత్య శారద చాహత్ వాజ్పాయ్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత వరంగల్ మహా నగర-పాలక సంస్థ కమిషనర్ వెంకన్న ల దృష్టికి తీసుకువస్తామని ఆయన అన్నారు ఆర్థిక వనరులు సమకూరక ఎంతో ఇబ్బందులు పడుతున్నామని మేము నిర్వహించిన నరకాసుర వద ఉత్సవాలకు స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావాలని ఆయన కోరినారు గత సంవత్సరం 29 వేల రూపాయల లోటుబడ్జెట్ ఉందని ఆయన అన్నారు నరకాసుర వద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దీపావళి పరపతి సంఘం ఏర్పాటు చేసుకోవాలని



నిర్ణయించుకున్నామని ఆయన తెలిపినారు ఇట్టి సమావేశంలో నరకాసురవద ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి కోశాధికారి మరుపల్ల గౌతమ్ ఉపాధ్యక్షులు దూడే బాల కొమురెల్లి సహాయ కార్యదర్శులు వనం కుమార్ ఆవునురి రామన్న శెట్టి మోహన్ కార్యనిర్వాహక కార్యదర్శులు తవుటం నరసింహ, కాటం సతీష్ ఆర్గనైజర్స్ కుండె రాజు, ఆవునూరు ఐలేశం, కార్యవర్గ సభ్యులు పోలం రంజిత్, కుండే సదానందం, గౌడ కోటేశ్వర్లు ఉన్నారు.

# శ్రీ భద్రకాళి అమ్మవారి శరన్న వరాత్రుల మహోత్సవంలో నాలుగో రోజు

**అమ్మవారు మహాలక్ష్మి గా అలంకరణ.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహటరీత్సవములు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అమ్మవారిని మహాలక్ష్మి గా అలంకరించి పూజారాధనలు జరిపారు. మంత్రదీక్ష తీసుకొని సాధకుడు మంత్రానుష్టానం చేస్తుండగా అమ్మవారు ధనమూల మిదం జగత్ అని కదా అందుకోసం సాధకుడి అనుష్ఠానం పట్ల ప్రసన్నమైన అమ్మవారు సాధకుడికి అమితమైన ఐశ్వర్యాన్నిస్తుంది అనటానికి సంకేతంగా అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించడంలోని నేపథ్యం, నవరాత్రులలో మహాలక్ష్మి రూపంలోని దర్శించిన భక్తులకు అఖండలక్ష్మి ప్రాప్తి కలిగిస్తుంది. నవదుర్గా కల్పోక్త నవరాత్ర పూజా విధానాన్ని అనుసరించి అమ్మవారిని కూష్మాండీ గిరిజ క్రమాలలో పూజారాధనలు జరిపారు. బుధవారం సాధకుని మనస్సు అనాహత చక్రం నందు స్థిరమౌతుంది. కావున ఈ దినమున సాధకుడు మిక్కిలి పవిత్రమైన మనస్సుతో కూష్మాండాదేవి స్వరూపాన్ని ధ్యానిస్తూ పూజలు జరపాలి. తద్వార అమ్మవారు భక్తుడి ఉపాసనకు పరితృప్తయై అసురీ శక్తులను భక్తుల నుండి దూరం చేస్తుంది. గిరిజా క్రమంలో ఆరాధింపబడిన అమ్మవారు సాధకులకు సకల సౌభాగ్యాలు ప్రాప్తింప జేస్తుంది. ఈ రోజు అమ్మవారిని ఉదయం సూర్యప్రభ వాహనం మీద సాయంకాలం హంస వాహనం మీద ఊరేగింపు





జరిపారు. ఉదయం సూర్యప్రభ వాహనం మీద సావిత్రిగా అలంకరించి సాయంకాలం హంస వాహనంపై బ్రాహ్మీమాతగా అలంకరించి ఊరేగించారు. సూర్యప్రభ వాహనం మీద సావిత్రి మాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించిన వారికి ధర్మశ్రద్ధ ఏర్పడుతుంది. యతో ధర్మ స్థతో జయ అని కదా శాస్త్ర వచనం. ధర్మాన్ని నమ్ముకున్నవాడు విజయం సాధిస్తాడు. అట్లాగే హంస వాహనం మీద బ్రహ్మీమాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించడం వలన మేధాశక్తి కలిగి ఉంటాడు. మంచి, చెడు విచక్షణ కలిగి ఉంటాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.బుధవారం కార్యక్రమాలకు శ్రీ గంద్ర భూపాల్ రెడ్డి-రూపా దంపతులు, శ్రీ గంద్ర అభిలాష్ రెడ్డి-దివ్య దంపతులు, శ్రీ గంద్ర సాయికృష్ణారెడ్డి-భావనాంజలి దంపతులు, శ్రీ అనసూరి శ్రీనివాన్-బాలజనని దంపతులు, శ్రీ అట్టం శంతన్ పటేల్- శ్రీగంధ దంపతులు, శ్రీ ముప్పిడి సుధీర్ రెడ్డి- అర్పిత తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈ.ఓ రామల సునీత పర్యవేక్షించారు. దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ శ్రీ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు.
బుధవారం అమ్మవారిని తొగుట పీఠాధీశ్వరులు శ్రీ మాదవానంద నరస్వతీ స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో భక్తులను ఉద్దేశ్యించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంతరం దేవాలయములో తయారు చేయబడుచున్న నూతన రథమును పరిశీలించారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల ప్రగతి తదితర అంశాలపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీలు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి దర్యాప్తు ఏ దశలో ఉందనే అంశంపై సంబంధించిన అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది.
ప్రధానంగా పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టు, నిందితులు పరారీలో ఉన్నట్లయితే వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ త్వరితగతిన అరెస్టు చేయాలని.
కేసుల దర్యాప్తు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. దర్యాప్తులో జాప్యం కారణంగా కేసులు పెండింగ్‌లో ఉండకుండా, ప్రతి కేసుకు స్పష్టమైన కార్యాచరణ



ప్రణాళిక రూపొందించుకొని దర్యాప్తును, అవసరమైన చోట సాంకేతికతను ఉపయోగించుకుంటూ ముందుకు తీసుకెళ్లాలని.
ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు, తీవ్రమైన నేరాలు తదితర కేసుల దర్యాప్తు పురోగతితో పాటు ప్రజలకు త్వరితగతిన న్యాయం అందే విధంగా కేసుల దర్యాప్తును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని




అధికారులను అదేశించడం జరిగింది.రానున్న బతుకమ్మ దసరా పండుగలను పురస్కరించుకొని ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి వారి పరిధిలో ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకునే విధంగా తగు చర్యలు తీసుకోవడంతో పాటు, శాంతి భద్రతలకు ఎలాంటి సమస్య రాకుండా ముందస్తు చర్యలతో పాటు ముమ్మర పెట్రోలింగ్ చేపట్టాలని అధికారులను అదేశించడం జరిగింది.
ఈ నేర సమీక్షా సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీ లు రాయల ప్రభాకర్ రావు, హన్మకొండ ఎ సి పి నరసింహారావు, కాజీపేట ఎ సి పి ప్రశాంత్ రెడ్డి, పలువురు సి ఐ లు, ఎస్సై లు, ఐటీ కోర్ అధికారులు పాల్గొన్నారు.

## దుర్గాదేవిని దర్శించుకొని పూజలు చేసిన

వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
నర్సంపేట రోడ్ లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో నాలుగవ రోజు కాత్యాయిని రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో నాలుగవ రోజు కాత్యాయిని దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు ఈ సందర్భంగా వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆలయ కమిటీ అధ్యక్షులు మీసాల ప్రకాష్ మాట్లాడుతూ నాలుగో రోజు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారని అన్నారు నాలుగవ రోజు చండీ హోమం నిర్వహించడం జరిగిందని అన్నారు కోరిన కోరికలు తీర్చే అమ్మవారు లోక కళ్యాణ అర్థం భక్తుల రక్షణార్థం ఎల్లవేళలా అమ్మవారి కృప ఉండాలని కోరుకున్నారు అని అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## 43వ డివిజన్ టీచర్స్ కాలనీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో.

పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాలనీల అధ్యక్షుడు కర్ని రవీందర్.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
బుధవారం 43 డివిజన్ టీచర్స్ కాలనీలో దుర్గ దేవి యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు .అనంతరం మహా అన్నదాత కార్యక్రమ చేపట్టినారు ఈ కార్యక్రమంలో కాలనీల అధ్యక్షుడు కర్ని రవీందర్ టీచర్స్ కాలనీ అధ్యక్షుడు దూలం అనిల్ గౌడ్ కాలనీ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడు రామ్మూర్తికి పరామర్శ

5 వేల రూపాయల అందజేత



ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి అక్టోబర్ 14: ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ సభ్యుడు రామ్మూర్తి ప్రమాదంలో గాయపడటంతో అతనిని వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న యూనియన్ సభ్యులు అతనిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. యూనియన్ ఉపాధ్యక్షుడు పాషా స్పందించి 5 వేల రూపాయలను రామ్మూర్తి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ సభ్యులకు ఎవరికి ఏ సమస్య వచ్చినా యూనియన్ తరపు నుంచి యూనియన్ సభ్యులు యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు రామ్మూర్తి కుటుంబ సభ్యులకి యూనియన్ సభ్యులు మేమున్నామని మనోధైర్యం అనేది ఇచ్చారు హాస్పటల్లో రామ్మూర్తికి అన్నవిధాలుగా అండగా ఉంటూ డాక్టర్ తో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ రామ్మూర్తి కుటుంబ సభ్యులకి మనోధైర్యం ఇవ్వడం జరిగినది రామ్మూర్తికి యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటదని రామ్మూర్తి కి అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు గౌరవ సలహాదారులు నరేంద్ర, వెంపటే వెంకటేశ్వర్లు గౌరవ అధ్యక్షుడు వెంపటి ఉపేందర్ ప్రెసిడెంట్ కిషన్ ఉపాధ్యక్షులు పాషా, భద్రం, గిరి ట్రెజరర్ సైదులు, సెక్రటరీ జానీ, నరసరావు, హనుమంతు ఈసీ నెంబర్ వెంకటేష్ ఫయాజ్ వడ్లకొండ శీను అంజి శ్రీకాంత్ స్వామి కాజా సీతారామరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు

# బాలికలు తమ హక్కులు, రక్షణపై అవగాహన కలిగి ఉండాలి.

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్

సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దు.

వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు.

సైబర్ వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.

అవసరమైనప్పుడు షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి.






వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్.
ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికల భద్రత, మహిళా రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హనుమకొండలోని బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో షీ టీమ్స్ ఎసిపి సదయ్య నేతృత్వంలో బాలికా సంఘాలకు బుధవారం నాడు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, కౌమార దశలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమిస్తూ జీవితంలో లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని బాలికలకు సూచించారు. ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని, అవసరమైనప్పుడు షీ టీమ్స్ సహాయం పొందాలని తెలిపారు.
సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మానసిక అడ్డంకులను అధిగమిస్తూ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, సోషల్ మీడియాను విచక్షణతో వినియోగిస్తూ సైబర్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.రాధిక మాట్లాడుతూ, కౌమార దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా, సంకోచించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.

బాలికల భద్రత, సాధికారత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలను ధైర్యంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ~ాను~ఖ ఇన్‌స్పెక్టర్ ఓ.రమేష్, భరోసా సెంటర్ ఎస్ఐ కిరణ్మయి, షీ టీమ్స్ ఆర్.ఎస్ఐ స్వాతి, ఎస్ఐ రామారావు తదితర పోలీస్ అధికారులు, వరంగల్ జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన బాలికలు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# జీడబ్ల్యూఎంసీలో బతుకమ్మ సంబరాలకు ఘనంగా ఏర్పాట్లు

మహిళా ఉద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి.

కమిషనర్ టి. వెంకన్న.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్, పారిశుధ్యం, ఫాగింగ్, తాగునీరు, బతుకమ్మల తయారీ, మహిళా సంఘాల సమీకరణ, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు తదితర ఏర్పాట్ల కోసం అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న అన్ని విభాగాల మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నగర మహిళలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మలతో పెద్ద సంఖ్యలో హాజరై, ఆటపాటలతో సంబరాల్లో పాల్గొని వేడుకలకు మరింత శోభ తీసుకురావాలని కమిషనర్ టి. వెంకన్న పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను అందరి భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో నిర్వహించి, వరంగల్ నగర సంప్రదాయాల గొప్పతనాన్ని చాటాలని ఆయన కోరారు.

## మాదాపూర్ ది జాయింట్ ఆల్ మంది రెస్టారెంట్ లో మటన్ బిర్యానీ లో పుచ్చి పోయిన మనిషి పళ్ళు స్పెషల్..

మామూళ్ల మత్తులో ఫుడ్ సెఫ్టీ అధికారులు..





మాదాపూర్ నీలగిరి వార్త ..
మాదాపూర్ “ది జాయింట్
అల్ మంది రెస్టారెంట్ లో మటన్ మంది తింటుండగా వచ్చిన మనిషి యొక్క పుచ్చిపోయిన పన్ను వచ్చింది ఇదేంటని యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు ఏం చేసుకుంటావో చేసుకో ఎక్కడైనా ఫిర్యాదు చేసుకో అని బెదిరింపులకు దిగిన యాజమాన్యం. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా ఏదో ఒకటి మాట్లాడుకుని సెటిల్మెంట్ చేసుకోవాలని సూచించిన ఫుడ్ ఇన్స్పెక్టర్ నిహారిక. ఫిర్యాదు చేసి గంటలు దాటుతున్న ఇంకా రాని అధికారులు. హోటల్ యజమాని చిరంతన్ రెడ్డి అతని సిబ్బంది. తనకి అధికారులు అండదండలు ఉన్నాయి అని చెపుతూ ఫోన్లు చేసి బెదిరింపుల కి గురి చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేసారు ఈ విషయం పై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

## మిల్స్ కాలనీ పోలీసుల సహాయంతో నిరుపేద వృద్ధుడిని చేరదీసిన.

కన్నతల్లి ఆశ్రమం నిర్వాహకులు.




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలో ని ఖిల్లా వరంగల్ కోటలోని పరపతి సంఘము కార్యాలయంలో సుమారు 70 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడిని స్థానిక ప్రజలు గుర్తించి మిల్స్ కాలిని పోలీసులకు సమాచారం అందించారు వెంటనే పోలీసులు నవీన్ మహిళా కానిస్టేబుల్ స్వాతి అక్కడకు చేరుకుని వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు ఒక్కసారి కాజీపేట మరొక్కసారి నెక్కొండ అని పొంతన లేని సమాధానం చెబుతున్నాడు అని అన్నారు వెంటనే కన్నతల్లి వృద్ధా ఆశ్రయం చైర్మన్ కొండమీది రాజన్ బాబు సమాచారం అందించారు వృద్ధుడిని తీసుకొని 40 వ డివిజన్ ఉప్పారోని కుంట ప్రాంతంలో ఉన్నటువంటి కన్నతల్లి వృద్ధా అశ్రయంలో చేర్పించారు వృద్ధా అశ్రమ నిర్వహికులు కొండమీది రాజన్ బాబు మాట్లాడుతూ మిల్స్ కాలిని సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి ఆదేశాల మేరకు ఈ మతిస్థిమితం లేని వృద్ధుడిని మా ఆశ్రయంతీసుకుంటున్నాము అని అన్నారు.

# జయదుర్గా మైసమ్మ దేవస్థానంలో వైభవంగా శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు..

**శ్రీ మీనాక్షిదేవి రూపంలో భక్తులకు దర్శనం..**



శేరిలింగంపల్లి నీలగిరి వార్త ..
హైదర్‌నగర్‌లోని స్వయంభూ శ్రీ జయదుర్గా మైసమ్మ దేవస్థానంలో నిర్వహిస్తున్నశ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవా ల్లో భాగంగా నాల్గవ రోజున శ్రీ శ్రీ శ్రీ జయ దుర్గా మైసమ్మ తల్లి శ్రీ మీనాక్షిదేవి స్వ రూపంలో భక్తులకు దర్శనమిస్తూ అనుగ్ర హిస్తున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు,అర్చ నలు నిర్వహించగా,అమ్మవారిని దర్శిం చు కున్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్ర మం చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... శరన్నవ రాత్రి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని,దైవ చింతనను కలిగించే పవిత్రమైన సందర్భమని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకుంటు న్నారని పేర్కొన్నారు.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేపు,15వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగ ణంలో శ్రీ పార్వతీ పర మేశ్వరుల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించ నున్నారు.కల్యాణ మహోత్సవం అనంతరం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పవిత్ర కల్యాణ మహోత్స వానికి భక్తు లు,స్థానిక ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి,స్వామి వార్ల కల్యాణాన్ని వీక్షిం చి,అన్నప్రసాదాన్ని స్వీకరించి,శ్రీ పార్వతీ పరమేశ్వరుల శ్రీ జయదుర్గా మైసమ్మ తల్లి కృపాకటాక్షాలకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. అమ్మవారి అనుగ్రహం తో ప్రజలందరికీ సుఖశాంతులు,ఆయు రారోగ్యాలు,అష్టైశ్వర్యాలు కలగాలని వారు అమ్మవారిని వేడుకున్నారు.

# అడిషనల్ డీసీపీ కుమారుడి అద్భుత ప్రతిభ.

**జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వేముల శ్రీఆంష్.**

**అండర్ 19 విభాగంలో అత్యంత విలువైన క్రీడా ఘనుడు.**

**క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తిని కనపరుస్తున్నాడు.**

**పిన్న వయసులోనే ఉన్నతంగా ఎదిగి చూపిస్తున్నాడు.**

**10 మీటర్స్ ఎయిర్ పిస్తోల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు.**

**అడిషనల్ డీసీపీటఏఆర్ఊ వేముల శ్రీనివాస్ కుమారుడు శ్రీఆన్షుకు ప్రశంసల వెల్లువ.**

వరంగల్ బ్యూరో నీలగిరి వర్క్.
క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని కనపరిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవడం ఎంత సులభమో ఉమ్మడి వరంగల్ జిల్లా హన్మకొండ ప్రాంతానికి చెందిన శ్రీఆన్ష తన క్రీడా స్ఫూర్తిని జాతీయస్థాయిలో కనపరచడం ఎత్తైన ఘనతను సాధించిన క్రీడాకారునిగా తన పేరును లిఖించుకోగలిగాడు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అడిషనల్ డీసీపీ(ఏఆర్)గా పని చేస్తున్న వేముల శ్రీనివాస్ కుమారుడు వేముల శ్రీఆంష్ అండర్ 19 ఎయిర్ పిస్తోల్ విభాగంలో ద్వితీయ స్థానం సంపాదించి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ ప్రాంతం నుండి ఎంపిక చేయబడి తెలంగాణ కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాడు.(ప్రి- నేషనల్)ఈవెంట్ విభాగంలో మధ్యప్రదేశ్ భూపాల్ లో జరిగిన 10 మీటర్ల ఏర్ పిస్తోలు విభాగంలో అద్భుత ప్రతిభను కనపరిచి ద్వితీయ స్థానం సాధించడం వెనకాల కఠోరమైన శ్రమ క్రమశిక్షణతో కూడిన పట్టుదల క్రీడా స్ఫూర్తిపై తనకు ఉన్నటువంటి ఆసక్తి మమకారం తను ఎన్నిక చేయబడడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని పలువురు ప్రముఖులు శ్రీఆంష్ క్రీడా స్ఫూర్తిని అభినందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూనే ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా స్ఫూర్తి అవకాశాలలో ఆణిముత్యం లాంటి క్రీడాకారులు వెలుగులోనికి వస్తుండగా అందులో ప్రతిభావంతమైన క్రీడా స్ఫూర్తిని కనపరిచే శ్రీఆంష్ వెలుగులోనికి రావడం ఉన్నత స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకోవడం రాష్ట్ర ప్రతిష్టను దేశస్థాయిలో ప్రకటించడం రాష్ట్రంలో యువ క్రీడాకారులకు ప్రత్యేక పోటీ తత్వాన్ని పెంచే విధంగా కనిపిస్తుందని పలువురు భావిస్తున్నారు. కాకతీయ డిగ్రీ కళాశాలలో బిబిఏ రెండవ సంవత్సరం చదువుతున్న శ్రీఆంష్ వచ్చే నెలలో ఢిల్లీలో జరగబోయే నేషనల్ షూటింగ్ కాంపిటీషన్లో పాల్గొనబోతున్న సందర్భంగా ప్రస్తుతం కనబరిచిన అద్భుత ప్రతిభను తను పాల్గొనబోయే క్రీడా టోర్నమెంట్లో సాధించాలని



ఆశిస్తూనే యువ క్రీడాకారులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కేడీసీ(ప్రభుత్వ) కళాశాల యాజమాన్యానికి ఫిజికల్ డైరెక్టర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ యువ క్రీడాకారులను దేశస్థాయిలో రాణించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ దేశ స్థాయి క్రీడల్లో ఉన్నత ప్రతిభను కనపరిచే విధంగా శ్రీఆశీష్ ను తీర్చిదిద్దుతున్న తన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తూ మరెన్నో ప్రతిభావంతమైన క్రీడా పథకాలను అందుకోవాలని తెలంగాణ ప్రజల తరఫున శ్రీఆంష్ ను ప్రత్యేకంగా అభినందించనైనది.

# తీరొక్క పూలతో అలంకరించి ఆరాధించే పండుగ

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఉత్సాహభరితంగా కలెక్టరేట్ లో అట్ల బతుకమ్మ వేడుకలు**

**బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి అక్టోబర్ 14: తీరొక్క పూలతో అలంకరించి పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ మన బతుకమ్మ అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఐదవ రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా కలెక్టరేట్ లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలలో కలెక్టరేట్లోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ, జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా పౌర సంబంధాల శాఖ, సహాయ సంచాలకులు (సర్వే మరియు భూ రికార్డులు), ఉపాధి శాఖ, ఖజానా శాఖ, ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయం, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయం, జిల్లా సరఫరాల శాఖ, ఎస్డీసి, ఎస్సీ కార్పొరేషన్, గనుల శాఖ, కార్మిక శాఖ, గృహ నిర్మాణ శాఖ, పట్టణ ప్రణాళిక శాఖ తదితర అన్ని శాఖల మహిళా అధికారులు, మహిళా సిబ్బంది అంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పూజించారు. అమ్మవారికి కొబ్బరికాయ, ప్రసాదాలు సమర్పించి, జిల్లా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఆట పాటలతో సందడి చేసిన మహిళలు, ఉద్యోగులను కలెక్టర్ ఉత్తేజపరిచారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారని కలెక్టర్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఐడీఓసీ ప్రాంగణంలో వివిధ రకాల రంగురంగుల పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. పూలతో ఆకర్షణీయంగా అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. మహిళా ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మకు పూజలు నిర్వహించి, పూలు సమర్పిస్తూ సంప్రదాయాలను పాటించారు. ఈ



సందర్భంగా మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ చేరి ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యత, ఆత్మీయత, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగాయి. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. పూల అలంకరణలు, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో కలెక్టర్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరూ బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.

# హైదరాబాద్‌లోని చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్‌లో పీఎంజే జ్యువెలర్స్ కొత్త స్టోర్ ప్రారంభం




**అట్టహాసంగా ప్రారంభమైన ఈ కొత్త స్టోర్‌తో హైదరాబాద్‌లో బ్రాండ్ మరింత బలపడింది. దీంతో కలిపి నాలుగు రాష్ట్రాల్లోని పీఎంజే రీటైల్ నెట్‌వర్క్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది.**

ఎల్బీనగర్ నగర్ నీలగిరి వార్త (అక్టోబర్ 14,) : అద్భుతమైన హస్తకళా నైపుణ్యానికి, కాలాతీత అందాలకు ప్రసిద్ధి చెందిన దక్షిణ భారతదేశ ప్రజలకు అత్యంత ఇష్టమైన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్ అయిన పీఎంజే జ్యువెలర్స్, హైదరాబాద్‌లోని దిల్?సుఖ్‌నగర్, చైతన్యపురిలో కొత్త స్టోర్‌ను ఘనంగా ప్రారంభించినట్లు ఇవాళ ప్రకటించింది. పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ దీపక్, చైతన్యపురి స్టోర్ మేనేజర్ మధన్ కుమార్ మరియు పీఎంజే జ్యువెలర్స్ కస్టమర్ల సమక్షంలో ఈ స్టోర్ ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంతో పీఎంజే జ్యువెలర్స్ తన రిటైల్ ఉనికిని మరింత బలోపేతం చేసుకుంది. దీనితో భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఈ బ్రాండ్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది.
కొత్తగా డిజైన్ చేసిన ఈ స్టోర్, సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక సౌందర్యంతో మిళితం చేసి, కస్టమర్లకు ఒక అద్భుతమైన ఆభరణాల కొనుగోలు అనుభవాన్ని అందిస్తోంది. ఇక్కడ హ్యాండ్‌క్రాఫ్టెడ్ జ్యువెలరీ భారీ కలెక్షన్ అందుబాటులో ఉంది. ఇందులో టెంపుల్ జ్యువెలరీ, యాంటిక్ గోల్డ్ నెక్లెస్‌లు, వడ్డాణాలు, బ్రైడల్ జ్యువెలరీ సెట్లు, హాఫ్-చీర మరియు అకేషన్-వేర్ ఆభరణాలు, డైమండ్ జ్యువెలరీతో పాటు రంగురంగుల రత్నాలతో తయారు చేసిన అలంకర ణలు ఉన్నాయి. అంతేకాకుండా, కుందన్, పోల్కి, జడవు స్టైల్స్‌తో పాటు రోజువారీ ధరించే తేలికపాటి నెక్లెస్‌లు, ఇయర్‌రింగ్స్ మరియు రింగుల విస్తృత శ్రేణిని కూడా కస్టమర్‌లు పరిశీలించవచ్చు. ఈ కొత్త స్టోర్ ప్రారంభం గురించి పీఎంజే జ్యువెలర్స్ సీఈఓ కిరణ్ షిండే మాట్లాడుతూ, "చైతన్యపురిలోని మా కొత్త స్టోర్‌తో నాలుగు రాష్ట్రాల్లో పీఎంజే జ్యువెలర్స్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది. గత 60 ఏళ్లుగా కాలాతీత హస్తకళా నైపుణ్యం కోసం కస్టమర్‌లు మాపై నమ్మకం ఉంచుతున్నారు. ఆ వారసత్వాన్ని మరియు వ్యక్తిగత షాపింగ్ అనుభవాన్ని దిల్?సుఖ్‌నగర్ ప్రాంత కుటుంబాలకు మరింత దగ్గర చేయడం మాకు చాలా సంతోషంగా ఉంది. మా కొత్త స్టోర్ సాంప్రదాయ కళను, ఆధునిక డిజైన్‌ను ఏకం చేస్తూ.. నాణ్యత, పారదర్శకత మరియు తరతరాలుగా కస్టమర్‌లు మా బ్రాండ్‌పై ఉంచిన నమ్మకానికి అద్దం పడుతోంది" అని తెలిపారు.ఈ సందర్భంగా పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ శ్రీ దీపక్ మాట్లాడుతూ, "మా చైతన్యపురి స్టోర్ గ్రాండ్ లాంచ్‌ను ప్రకటించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతి క్షణం అందాన్ని ప్రతిబింబించే కాలాతీత ఆభరణాలను రూపొందించడానికే పీఎంజే జ్యువెలర్స్ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. మా కొత్త స్టోర్ ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. అసాధారణమైన హస్తకళా నైపుణ్యం, సమకాలీన డిజైన్‌లు మరియు తరతరాలుగా మా బ్రాండ్‌పై కస్టమర్లు ఉంచిన నమ్మకాన్ని ఇది ఒకచోట చేర్చుతుంది" అని



తెలిపారు.చైతన్యపురి స్టోర్ మేనేజర్ శ్రీ మధన్ కుమార్ మాట్లాడుతూ, "మా తాజా క్రియేషన్స్‌ను కొత్త స్టోర్‌లో ఆవిష్కరిస్తున్న తరుణంలో, పీఎంజే జ్యువెలర్స్ ప్రత్యేకతను చాటే అద్భుతమైన డిజైన్‌లను పరిశీలించాల్సిందిగా మా కస్టమర్లను ఆహ్వానిస్తున్నాము. ప్రతి ఆభరణం వెనుక ఒక ప్రత్యేకమైన కథ ఉంటుంది. వివాహాలు, కుటుంబ వేడుకల నుంచి ప్రతి చిన్న మైలురాయి వరకు మా కస్టమర్ల ప్రత్యేక క్షణాల్లో భాగం కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.చైతన్యపురిలో పిఎంజే జ్యువెలర్స్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కస్టమర్లు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాణ్యత, నమ్మకం మరియు కస్టమర్లతో సార్థకమైన బంధాన్ని కొనసాగించడంలో పీఎంజే జ్యువెలర్స్ చూపుతున్న అంకితభావాన్ని ఈ కొత్త స్టోర్ ప్రతిబింబిస్తోందని వారు పేర్కొన్నారు.60 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పీఎంజే జ్యువెలర్స్, అత్యుత్తమ లగ్జరీ ఫైన్ జ్యువెలరీ బ్రాండ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. శాశ్వతమైన నాణ్యత, వ్యక్తిగత సేవలు మరియు ప్రత్యేకమైన ఆభరణాలు కోరుకునే కస్టమర్లకు నిపుణుల మార్గదర్శకత్వం అందించడంలో ఇది ప్రసిద్ధి చెందింది. ఈ బ్రాండ్ విస్తృత శ్రేణితో కూడిన డైమండ్ వెడ్డింగ్ జ్యువెలరీని అందిస్తోంది. తరతరాలుగా కుటుంబాల్లో ప్రత్యేక జ్ఞాపకాలుగా నిలిచిపోయేలా ప్రతి ఆభరణాన్ని ఎంతో సూక్ష్మంగా రూపొందిస్తారు.నాణ్యత మరియు కస్టమర్ల నమ్మకానికి కట్టుబడి ఉన్న పీఎంజే జ్యువెలర్స్, తమ స్టోర్లలో డైమండ్ టెస్టింగ్ మెషీన్లను (ఐవీం) ఏర్పాటు చేయడం ద్వారా పారదర్శకతను మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల కస్టమర్లు డైమండ్ ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన అవగాహనతో స్పష్టమైన నిర్ణయం తీసుకోవచ్చు.ప్రతి ఆభరణం అనుభవజ్ఞులైన కారిగర్ల (చేతివృత్తి నిపుణుల) నైపుణ్యాన్ని, అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఇందులో సున్నితమైన హస్తకళా నైపుణ్యం, విశిష్టమైన డిజైన్ శైలి కలిసి ఉంటాయి. నాణ్యత, విలువ, హస్తకళా నైపుణ్యానికి సంబంధించి పీఎంజే భరోసా ప్రతి క్రియేషన్‌లోనూ కనిపిస్తుంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే మారుతున్న కస్టమర్ల అభిరుచులకు తగినట్లుగా ఆభరణాలను రూపొందించాలన్న బ్రాండ్ నిబద్ధతను ఇది మరింత బలపరుస్తోంది. చైతన్యపురిలో ప్రారంభమైన ఈ కొత్త స్టోర్ పీఎంజే జ్యువెలర్స్ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. దీనిద్వారా ఈ బ్రాండ్‌కు చెందిన ప్రసిద్ధ కలెక్షన్లు, పర్సనలైజ్డ్ షాపింగ్ అనుభూతి దిల్?సుఖ్‌నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల కస్టమర్లకు మరింత చేరువయ్యాయి.




# సందీప్ కిషన్ ఫాంటసీ వరల్డ్ లోకి కొత్త బ్యూటీ!

టాలీవుడ్ యంగ్ సందీప్ కిషన్ ఫాంటసీ వరల్డ్ లోకి కొత్త బ్యూటీ! టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ కెరీర్ లోనే ఒక భారీ ప్రతిష్టాత్మక చిత్రం పట్టాలెక్కేందుకు ముహూర్తం ఖరారైంది. సోషియో ఫాంటసీ బ్యాక్ డ్రాప్ లో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న 'కరికాల' మూవీ పూజా కార్యక్రమాలు అక్టోబర్ 15న ఎంతో గ్రాండ్ గా జరగబోతున్నాయి. పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో మొదలుకాబోతున్న ఈ ప్రాజెక్ట్ పై అప్పుడే ఇండస్ట్రీ సర్కిల్స్ లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో శంబాల లాంటి డిఫరెంట్ అటెంప్ట్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ యుగంధర్ ముని ఈ ప్రాజెక్ట్ ను డైరెక్ట్ చేస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మాతలు మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ సినిమాను ఒక విజువల్ వండర్ గా డిజైన్ చేసేందుకు ప్లాన్ చేశారు. శంబాల తర్వాత ఈ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో మేకింగ్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కథను సిద్ధం చేశారు. ాశ్రీంశీ =ఝ౦ - కథ వినగానే ఫ్లాట్.. హైందవ సెట్ సీక్రెట్స్ చెప్పేసిన సంయుక్త ఇక ఈ ఫాంటసీ వరల్డ్ లో కాస్టింగ్ కూడా గట్టిగానే ప్లాన్ చేసినట్లు అర్థమవుతోంది. ఇప్పటికే కేథరిన్ థ్రెసా, సాక్షి మడోల్కర్ ఈ ప్రాజెక్ట్ లో భాగం కాగా, లేటెస్ట్ గా మరో బ్యూటీ గాయత్రి భరద్వాజ్ ను టీమ్ లోకి ఆహ్వానించారు. ఆమెకు వెల్కమ్ చెబుతూ మేకర్స్ రిలీజ్ చేసిన స్పెషల్ పోస్టర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచేలా ఉంది. గాయత్రి ఇందులో ఒక అతి ముఖ్యమైన పాత్రలో నటించనుందని యూనిట్ అఫీషియల్ గా ప్రకటించింది.



# రాష్ట్రపతి భవన్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్!

బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ: పార్ట్ 1' నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా విడుదల రోజే ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాజకీయ ప్రముఖుల కోసం ఒక ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



ఈ వేడుకకు రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి మరియు దర్శకుడు నితీశ్ తివారీ హాజరయ్యే అవకాశం ఉంది. అలాగే ముంబైలోని చీహీూజజలో మరియు ఢిల్లీలో రెండు గ్రాండ్ ప్రీమియర్లను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. రణ్‌బీర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.



# విగ్రహాల దొంగతనం..

## దేవుడు ఏం చేస్తున్నాడు

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చాలా గ్యాప్ తరువాత నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ప్యాక్డ్ మూవీ హైందవటాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్) చాలా గ్యాప్ తరువాత నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ప్యాక్డ్ మూవీ హైందవ. లూధీర్ బైరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, స్పెషల్ గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా భారీ అంచనాలను పెంచేశాయి. తాజాగా ఈ సినిమా టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. దేవుళ్లు, నమ్మకాలు, ఆచారాలు, విగ్రహాల అదృశ్యం వంటి పవర్ టెల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ కట్ ఆకట్టుకుంటోంది.రంగాపురం అనే గ్రామంలో దేవుని విగ్రహాలు మాయమవుతాయి. దాంతోపాటూ సడెన్ గా మనుషులు హత్యకు గురవుతారు. ఇదంతా దేవుని ఆగ్రహం అని ప్రజలు భయపడుతుంటారు. ఇక ఈ కేసులను చేధించడానికి దేవుడంటే నమ్మకం లేని పోలీస్ గా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కనిపించాడు. ఆ ఊర్లో విగ్రహాలను కొట్టేసింది ఎవరు.. ? ఆ విగ్రహాలలో ఏముంది.. ? పుష్కర సమయానికి గుడిలో విగ్రహాలు ఎలా వస్తాయి.. ? అనేది సినిమా చూసి తెల్సుకోవాల్సిందే.

# 'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్..

త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!




పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' (ఖుశ్రీనిఅ 2) షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ (చీుస్త్రూాంష్ట్రషఅఅ) తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి.అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆ య ౦ న అ బి వూ న౦ ల౦ ఎ ం తో ఉ త్సా వ ా ం గా ఎదురుచూస్తున్నారు.

Printed , Published AND Owned by GUNTOJU VISHNUMURTHY, Printed at V. M. PRINTER'S Plot no 108,Shivashankar Colony , Kuntloor (v ), Abdullapurmet (m), Rangareddy district, Telangana. Published at V. M. PUBLICATIONS,plot no 108,Shivashankar colony, Kuntloor (v), Abdullapurmet (m), Rangareddy district, Telangana state. Pin: 501505. Editor : GUNTOJU VISHNUMURTHY, RNI NO : APTEL : 31957 / 2009. CELL NO : 9676549223.